గెస్ట్ అధ్యాపకులకు దరఖాస్తులు

చార్మినార్, జనవరి 2 : ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్-1 ఉర్దూ-1 బోటనీ, జువాలజీ (ఉర్దూ మీడియం) లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. సంబంధిత సబెక్టుల్లో పీజీ పూర్తి చేసి 55శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు జనవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 8న ఫలక్‌నుమా కాలేజీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని తెలిపారు.

బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

రేపు కాచిగూడలో జాతీయ సదస్సు

కాచిగూడ, జనవరి 2: బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'ప్రజ్ఞా-2025' పేరుతో జాతీయ సదస్సును ఈనెల 4న ఉదయం 10 గంటలకు కాచిగూడ మున్నూరు కాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బర్కత్‌పుర అవంతి కళాశాల సెక్రటరీ సాయిరాం గురువారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణా రెడ్డి, ప్రముఖులు ఎం.రామ్మోహన్ రావు, ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి, బీకే వసంతలక్ష్మి, అనుపమరాజన్, అవంతి కళాశాలల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

భవిష్యత్ తరాలకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్లు

● అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జనవరి 2: అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పైపులైన్లు శిథిలావస్థకు చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఇందుకు సంబంధించి భవిష్యత్ తరాలకు అనుగుణంగా పైపులైన్ల ప్రక్షాళన చేపడుతున్నామని తెలిపారు. గురువారం గోల్నాక డివిజన్ అంబేద్కర్ నగర్‌లో రూ. 24లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ దూసరి లావణ్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవకర్గంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని బస్తీల రూపురేకలను మార్చి ఎలాంటి సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం ఆయన అంబేద్కర్‌నగర్‌లోని పలు బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను అడిగి సమస్యల గురించి ఆరాతీశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, ఏఈ రోహిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నాంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు, బీఆర్ఎస్ మెహిదీపట్నం డివిజన్ అధ్యక్షుడు మెట్టు నట్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– మెహిదీపట్నం, జనవరి 2

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– అంబర్‌పేట

అబిడ్స్, జనవరి 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల అనిత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అదేవిధంగా పాతబస్తీ లాల్ దర్వాజ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పంకజ్ షిండే కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ యువత కోసం ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేయండి..

కాచిగూడ, జనవరి 2: తెలంగాణ ప్రభుత్వం బీసీ యువతీయువకుల కోసం ప్రత్యేక ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ యువ చైతన్య పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో కూడిన ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీసీ యువ చైతన్య పోరాట సమితి అధ్యక్షురాలు కె. సంజన, హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంజన, శ్రీనివాస్‌రావు

అలరించిన నృత్య ప్రదర్శనలు

రవీంద్రభారతి, జనవరి 2 : సంక్రాంతి సంబురాల్లో భాగంగా భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థినులు ఈ ప్రదర్శనలు నిర్వహించి వీక్షకులను అలరింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దైవజ్ఞశర్మ విచ్చేసి కూచిపూడి, భరతనాట్యప్రదర్శనలను ప్రారంభించి, అనంతరం విద్యార్థినులకు అవార్డులు, జ్ఞాపికలు అందజేశారు. భద్రాద్రి సాంస్కృతిక శాఖ వ్యవస్థాపకులు కొండల్‌రావు, ప్రతినిధులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్

అబిడ్స్, జనవరి 2 : సంక్రాంతిని పురస్కరించుకొని చైనామాంజా విక్రయాలు జరగకుండా నిరోధించేందుకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అక్టోబర్ పదో తేదీ నుంచి ప్రారంభమైన ఈ స్పెషల్ రైడ్స్‌లో మొత్తం 18 కేసులు నమోదు చేసి 22 మందిని అదుపులోకి తీసుకుని 1094 చైనా మాంజా చరకాలను స్వాధీనం చేసుకున్నారు. సౌత్, వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ అశ్వక్ మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్‌తో కలిసి వివరించారు. చైనా మాంజాతో మనుషులతోపాటు పక్షులు, జంతువులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి సందర్భంగా భవనాలపైకి ఎక్కి పతంగులు ఎగుర వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్వాధీనం చేసుకున్న చైనా మాంజాతో సౌత్, వెస్ట్‌జోన్ అదనపు డీసీపీ అశ్వక్, మంగళ్‌హాట్ సీఐ మహేశ్‌గౌడ్

4,5 తేదీల్లో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు

రవీంద్రభారతి, జనవరి 2 : మహావీర్ ఇంటర్నేషనల్ స్వర్ణోత్సవాలు స్వర్ణోదయ పేరుతో ఈ నెల 4,5 తేదీల్లో హైదరాబాద్, శంషాబాద్ సిటాడెల్ కన్వెన్షన్‌హాల్‌లో జరుగనున్నాయి. ఈ స్వర్ణోత్సవాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రారంభిస్తారని అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్‌జైన్, అజయ్ సహత, చైర్మన్ వినోద్ సంచేటి, వైస్ చైర్‌పర్సన్ అర్చన సహత, కన్వీనర్ సీమశీల్ కుమార్‌జైన్ వివరాలను వెల్లడించారు. స్వర్ణోత్సవాలతో పాటు మహావీర్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవాలను కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 800 మంది ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు..

రాష్ట్ర మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గురువారం నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– మెహిదీపట్నం

బీఎఫ్ఏ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మల్లన్న ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

అంబర్‌పేట, జనవరి 2 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధి మల్లన్నగుడిలో జరగబోయే ఉత్సవాల విషయమై డివిజన్ కార్పొరేటర్ బీ. పద్మావెంకటరెడ్డి గురువారం ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

స్పెషల్ రైల్లో చోరీ

కాచిగూడ, జనవరి 2: స్పెషల్ రైల్లో ప్రయాణికుడి నగదు, ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రాజు స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా ఆతని బ్యాగును నిజామాబాద్ రెల్వేస్టేషన్ సమీపంలో చూసుకునేసరికి అందులో ఉన్న రూ.10 వేలు, ఖరీదైన ఫోన్, ఆధార్‌కార్డులు కనిపించలేదు. దీంతో గురువారం అతను కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కార్వాన్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌కు జీహెచ్ఎంసీ సర్కిల్ -13 ఈఈ వెంకటశేషయ్య, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ లు ఉదయ్, ఫరీదుద్దీన్, శ్రీకాంత్, రవిచంద్ర, పాండు, అభిరాం గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– మెహిదీపట్నం, జనవరి 2

అహ్మద్‌నగర్‌లో నాంపల్లి ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం, జనవరి 2 : నాంపల్లి నియోజకవర్గం అహ్మద్‌నగర్ డివిజన్‌లో గురువారం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డ్రైనేజీ తదితర సమస్యలపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ చూపుతానని పేర్కొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రవీంద్రభారతి, జనవరి 2 : సంచార జీవులైన వడ్డెరులను దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీలుగా పరిగణిస్తున్నట్లుగానే తెలంగాణలోనూ ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత వడ్డెర, వోడ్, బోవీ, బేల్దార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన వడ్డెరల రాష్ట్ర సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్ అఖిల భారత వడ్డెర, వోడ్, బోవీ, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమలదేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక తదితరులు పాల్గొని మాట్లాడారు. వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సదస్సులో మంజుల రమేశ్, మంచు రమ, బొంత చిరంజీవి, బోదాసు శ్రీనివాస్, రేపన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే, వాటర్ వర్క్స్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కాలె యాదయ్య, గౌర వాధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– అబిడ్స్, జనవరి 2

వ్యాపార సమయాలను పెంచాలని ఏసీపీకి వినతి

అబిడ్స్, జనవరి 2 : గోషామహల్ నియోజకవర్గంలో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రాత్రి వేళల్లో మినహాయింపు ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. గురువారం ఆయన గోషామహల్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ధూల్‌పేట్, మంగళ్‌హాట్, జుమ్మెరాత్‌బజార్ తదితర ప్రాంతాలలో చిరు వ్యాపారులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పతంగుల విక్రయాలను చేపడ్తారని, రాత్రి పది గంటలకు వారి వ్యాపారాలను మూసి వేయిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యాపార సమయాలను పెంచాలని కోరారు. ఇందుకు ఏసీపీ సానుకూలంగా స్పందించినట్లు ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ గోషామహల్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

డి. శోభనకు సావిత్రిబాయిపూలే ఎక్సలెన్సీ అవార్డు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 2 : డాక్టర్ శోభన దేశ్‌పాండేను సావిత్రిబాయి పూలే ఎక్సలెన్సీ అవార్డు 2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్‌ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని 36 ఏండ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న శోభనకు ఈ అవార్డును అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సరోజినీనాయుడు వనితా మహావిద్యాలయలో 2018 నుంచి ఆమె ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు.

టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: తెలంగాణ స్టేట్-స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10 నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించారు. ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చని పేర్కొన్నారు.

టీజీ సెట్ అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

టీటీడీ చైర్మన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడును గురువారం కార్వాన్ నియోజకవర్గం నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి బుడిగె అనూప్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– మెహిదీపట్నం, జనవరి 2

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రారంభానికి సిద్ధంగా ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం

అంబర్‌పేట, జనవరి 2: అంబర్‌పేటలో నూతనంగా నిర్మించిన ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. మరో వారం రోజుల్లో ప్రారంభించడానికి పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి లేదా హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పోలీసు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభించడానికి కసరత్తు ప్రారంభమైంది. నగర సీపీ సీవీ ఆనంద్ ఈ విషయమై చర్చిస్తున్నట్లు తెలిసింది. తూర్పు మండలం డీసీపీ కార్యాలయం ప్రస్తుతం అంబర్‌పేట పాత భవనంలో కొనసాగుతున్నది. ఆఫీసుకు సౌకర్యవంతంగా లేకపోవడంతో ఈ నూతన భవనాన్ని నిర్మించారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో పోలీసు హౌసింగ్ బోర్డు ద్వారా డీసీపీ ఆఫీసులకు అనుగుణంగా దీన్ని నిర్మించారు.

ఇందులో డీసీపీ కార్యాలయంలో పాటు అడిషనల్ డీసీపీ కార్యాలయం కూడా ఉంటుంది. ఈ విషయమై ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామిని అడుగగా త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, జనవరి 2: అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

11కేవీ అంబర్‌పేట పరిధిలోని ఎంసీ హెచ్ కాలనీ, ఆకాష్‌నగర్, రామకృష్ణానగర్, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

11కేవీ అయ్యప్ప దేవాలయం ఫీడర్ పరిధిలోని సాయిదత్తా నర్సింగ్‌హోమ్, టెలిఫోన్ ఎక్సేంజ్, మల్లికార్జుననగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పన్నుల రాబడిని పెంచేందుకు అధికారుల కృషి


వాణిజ్య పన్నుల శాఖ పంజాగుట్ట డివిజన్ జాయింట్ కమిషనర్ ఏడు కొండలును కలిసిన ఆ శాఖ ఎన్జీఓస్ ప్రతినిధులు నర్సింగ్‌రావు, సుజత్‌అలీ తదితరులు

అబిడ్స్, జనవరి 2 : వాణిజ్య పన్నుల రాబడులను పెంచడానికి అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని, అందుకు వ్యాపారుల సహకారం ఎంతో అవసరమని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ ఆర్‌వై ఏడు కొండలు అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సునీల్‌కుమార్, స్టేట్ సెక్రటరీ మధుసూదన్, యూనియన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, ప్రధానకార్యదర్శి సుజత్‌అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలాలుద్దీన్, కోశాధికారి సయ్యద్ మొహియుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ టి. ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, మధుసూదన్, సంయుక్త కార్యదర్శి సీహెచ్ చంటి, హరిబాబు, ఎంఏ ఖదీర్, లక్ష్మి, బాలకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు జాయింట్ కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

వాణిజ్య పన్నుల శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జాయింట్ కమిషనర్ డాక్టర్ ఆర్‌వై ఏడుకొండలు యూనియన్ నాయకులు నర్సింగ్‌రావు, సుజిత్ అలీ, జలాలుద్దీన్, సయ్యద్‌మొహిఉద్దీన్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు.

రేపు వాహనాల వేలం

పోచారం, జనవరి 2: పోచారం మున్సిపాలిటీ సురేందర్‌రెడ్డి నగర్‌లోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ రవి తెలిపారు. పలు కేసులలో పట్టుబడిన 8 వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.